# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న గవర్నర్



2లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 26 | అక్టోబర్ | 2024 | పేజీలు : 7

- జిల్లాలో యారో ఏజెన్సీ మోసాలు
- నియమకాల పేరిట నిరుద్యోగులకు ఎసరు
- వైద్య విభాగంలోని 155 పోస్టుల నిర్వహణ బాధ్యతలు తమకేనని ప్రచారం
- కోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా వస్తాయని మాయ మాటలు
- ఆ భర్తీ బాధ్యతలు యారో కి ఇవ్వమని తెల్చేసిన జిల్లా కలెక్టర్
- ఈ పోస్టుల పేరిట నిరుద్యోగుల నుండి ముందే వసూళ్లకు పాల్పడ్డ యారో నిర్వాహకులు
- సుమారు రూ. 4 కోట్ల రూపాయల వరకు వసూళ్లు
- గత రెండేళ్లలో మొత్తంగా రూ . 7 కోట్లు..!
- సహకరిస్తున్న అధికారులు..?
- "ప్రజాజ్యోతి"ని ఆశ్రయించిన పలువురు బాధితులు

# ఉద్యోగాల పేరిట ...
# రూ. కోట్లు వసూళ్లు



2లో..

వైద్య విభాగంలో నోటిఫికేషన్ జారీ చేసిన 155 ఔట్సోర్సింగ్ పోస్టులు మావే.. కోర్టులో కేసు వేస్తే స్టే వచ్చింది.. నియామక బాధ్యతలు కూడా మా ఏజెన్సీకే.. సంబంధిత అధికారులు మేము చెప్పినట్టు నడుచు కోవాల్సిందే.. అంటూ యారో ఏజెన్సీ నిరుద్యోగులను నమ్మబలికి కోట్ల రూపాయలు వసూలు చేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగుల ఆశలే అవకాశంగా మలుచుకొని ఈ ఏజెన్సీ నిర్వాహ కులు, కొందరు ఉన్నత స్థాయి అధికారులు సంయుక్తంగా వసూళ్లకు పాల్పడ్డారని తెలుస్తోంది. ఒక్కొక్క ఉద్యోగానికి డిమాండ్ మేరా రెండున్నర నుంచి మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్టు సమాచారం. మొత్తంగా 155 పోస్టులకు గాను రూ. 4 కోట్ల పైచిలుకు అక్రమ సంపాదనను ఈ ఏజెన్సీ నిర్వాహకులు కూడగట్టుకున్నట్టు ప్రచారం నడుస్తుంది.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి



# ఇంకెన్నాళ్లు...?

- భద్రాద్రి పాలకమండలిపై కొనసాగుతున్న నిరీక్షణ
- స్వరాష్ట్రంలో ఏర్పడని పాలక మండలి
- భర్తీ కోసం ఆశగా ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొలువుదీరేనా...?

7లో..

- అనుభవం లేని డ్రైవర్లు
- పరిమితికి మించిన బొగ్గు రవాణా
- 33టన్నులకు బదులు సుమారు 39 టన్నుల బొగ్గు రవాణా!
- హై స్పీడ్ ఫుల్.. లైసెన్స్ నిల్..
- నిద్రమత్తులో రవాణా శాఖ అధికారులు?
- పట్టించుకోని సింగరేణి అధికారులు?

# గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనలకు
# బొగ్గు లారీల తిలోదకాలు!

**టేకులపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా కెఓసి నుండి బొగ్గును సరఫరా చేసే లారీలు గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బొగ్గును లారీల్లో అధిక లోడుతో అధిక వేగంతో స్వైర విహారం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం బొగ్గును సరఫరా చేసే రహదారి మధ్యలో ఉన్న గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలి. లారీ బాడీ కన్నా తక్కువగా బొగ్గును లోడు చేయడం, బొగ్గు కనపడకుండా టార్పాలిన్లను కట్టాల్సి ఉంటుంది. అతివేగం, అధిక లోడుతో లారీ వాయు వేగంతో దూసుకుపోతునట్లు తెలుస్తుంది. 16 టైర్ల లారీకి ప్రభుత్వ నిర్ణయించిన టిప్పర్ కు 33టన్నులు మాత్రమే బొగ్గు రవాణా చేయాల్సి ఉన్నప్పటికీ సుమారుగా 39 టన్నులను, 14 టైర్ల లారీ 27 టన్నులకు



మిగతా 2లో...

## గ్రీన్ ట్రిబ్యూనల్ నిబంధనలకు బొగ్గు లారీల తిలోదకాలు!

(మొదటి పేజీ తరువాయి...)

బదులుగా 33 టన్నుల బొగ్గును రవాణా చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. కేటీసీ నుంచి బొగ్గు లారీలు సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తుంటాయి. బొగ్గు అధిక లోడింగ్ వలన రోడ్డుపై నిత్యం పడుతున్న బొగ్గు పెళ్లలు, దుమ్ము వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఆదిశగా సింగరేణి అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు లేకపోలేదు. అయితే లారీలపై పూర్తి అవగాహన లేని, పెద్దగా అనుభవం లేని డ్రైవర్లను నియమించారని, దీంతో వారు రహదారులపై విచ్చలవిడిగా ఆ లారీలను నడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు లారీలు విపరీతమైన హైస్పీడ్ తో నడుపుతున్నారని, తమకు ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పగలు –రాత్రులు అనే తేడా లేకుండా విచ్చలవిడిగా డ్రైవింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. బొగ్గు లారీలు నడిపే డ్రైవర్లకు లైసెన్స్ లేదని, మద్యం సేవించి మత్తులో వాహనాలు నడుపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే ప్రధాన రహదారిపై ఎంతో మందికి ప్రమాదాలు జరిగి, విలువైన ప్రాణాలను కోల్పోయారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకొని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు రవాణా చేసే లారీల డ్రైవర్లకు ఒక్కరికి కూడా లైసెన్స్ లేదని, మద్యానికి అలవాటుపడి వాహనాలు నడుపుతుంటే రవాణాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి రవాణా శాఖ అధికారులు ఎందుకని లారీలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటే ఎన్నో లారీలు సీజ్ అవుతాయనేది వాస్తవం. ఇప్పటికైనా అధిక బొగ్గు లోడింగ్ లారీలపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కళ్ళముందే ఎంతో కావాల్సిన, ఇష్టమైన, స్నేహితులను కోల్పోయామని, కన్న తండ్రి కళ్ళముందే యముడు రూపంలో వచ్చి బైక్, ఆటో వివిధ రకాలుగా ప్రమాదాలు జరిగి లారీల వల్ల ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రవాణా, సింగరేణి అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మరల పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న గవర్నర్





**భద్రాచలం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. పోలీసు భద్రత నడుమ గవర్నర్ ను ఆలయ అర్చకులు వరివట్టం కట్టి ఆలయ మర్యాదలతో మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ ఘనస్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయ గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా గవర్నర్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో ఉప ఆలయాలైన లక్ష్మితాయారు, అభయాంజనేయ స్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గవర్నర్ కు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరామ్ నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీవో రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రవీందర్, ఏవో భవానీ కృష్ణ, ఆర్డీవో దామోదరరావు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరిట .. రూ. కోట్లు వసూళ్లు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి:**

155 పోస్టుల నియామక నిర్వహణ బాధ్యతలు యారో ఏజెన్సీకి ఇవ్వలేమని జిల్లా కలెక్టర్ తేల్చి చెప్పడంతో బాధితులు మోసపోయామంటూ గ్రహించి ఆందోళన చెందుతున్నారు. తమ డబ్బులు తిరిగి తీసుకునేందుకు మధ్యవర్తులను సంప్రదిస్తున్నారు. అయితే ఈ ఏజెన్సీ మొదటి నుండి ఉద్యోగాల పేరిట కూడగట్టుకున్న అక్రమ సంపద లెక్కలు తెలిస్తే నిబ్బరపోవాల్సిందే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వైద్య విభాగం చుట్టూ గత కొంతకాలంగా కొనసాగుతున్న వసూళ్ల వ్యవహారానికి ఈ అంశం ఓ గీటు రాయిగా నిలుస్తుంది.

### అందరిని మభ్యపెడుతూ...

జిల్లా యంత్రాంగంలోని అడ్మినిస్ట్రేటివ్, ఉపాధి కల్పన, వైద్య విభాగం లోని కొందరి అధికారులను మభ్యపెడుతూ ఈ ఏజెన్సీ అక్రమ వసూళ్లకు తెర లేపుతోంది. రెండు సంవత్సరాల క్రితమే రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏజెన్సీకి.. ఇప్పటివరకు మెడికల్ కళాశాలలో 32, 49 నర్సింగ్ స్కూల్ లో 25, ఫారెస్ట్ విభాగంలో 15 తో పాటు 104 సర్వీసెస్ తాలూకు టెండర్లు ఎలా దక్కాయి అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. మొదటిగా ఎలాంటి అనుభవం లేకుండానే ప్రభుత్వం మెడికల్ కాలేజీలో 32 అవుట్ సోర్సింగ్ పోస్టుల బాధ్యతను అనైతికంగానే అప్పగించారు. అయితే ఈ టెండర్ తాలూకు ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయకుండానే వేలం పాట నిర్వహించి సంబంధిత అధికారులు యారోకి అక్రమంగా కట్టబెట్టాలని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వేలం పాటకు సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్ క్రింద 70 లక్షల రూపాయలు బ్యాంక్ గ్యారంటీ తాలూకు ఆధారాలను సదరు ఏజెన్సీ జిల్లా కలెక్టర్ వద్ద ఉంచాల్సి ఉండగా.. ఇప్పటివరకు అలాంటివి ఏమి సమర్పించలేదని తెలుస్తుంది. అయితే ఈ ఏజెన్సీకి సహకరించిన కొందరు అధికారులు ఒట్టి బూటకపు వేలంపాట నిర్వహించి మిగతా ఏజెన్సీ నిర్వాహకులను బురిడీ కొట్టించినట్టు ఇందులో స్పష్టంమవుతుంది. దీంతోపాటు తదుపరిగా భర్తీ చేయాల్సిన 72 పోస్టులకు గాను 49 మందిని నియమించిన ఈ ఏజెన్సీ.. అందులో సగం కనీస విద్యార్హత లేని వారితో భర్తీ చేసింది. దీనికి కారణం కొందరు ఎక్కువ మొత్తంలో డబ్బు చెల్లించడమేనని తెలుస్తుంది. ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో టెండరు ఖరారు కాకముందే ఉద్యోగులను నియమించడం ఏజెన్సీ చేసిన అక్రమ వసూళ్లకు పరాకాష్టగా నిలుస్తుంది. తదుపరిగా టెండర్ దక్కడంతో కొంత వెసులుబాటును సమకూర్చుకుంది. అయితే ఇక్కడ సెక్యూరిటీని కూడా నియమించిన ఏజెన్సీకి అసలు "పసార" లైసెన్స్ ఉందా అన్నది తెలియాల్సి ఉంది. దీనితోపాటు భద్రాచలం ఫారెస్ట్ కార్యాలయంలో టెండర్ తగ్గించుకున్నాయి ఏజెన్సీ అక్కడే నియామకంలో సైతం చేతివాటం ప్రదర్శించిందని సమాచారం. అసలు ఎటువంటి అర్హత, అనుభవం, టర్నోవర్ లేని యారో ఏజెన్సీకి ఇన్ని అవకాశాలు తక్కువ కాలంలోనే దొరకడం వెనుక ఎంతోమంది అధికారుల అక్రమ ధోరణి దాగుందని స్పష్టమవుతుంది.

### ఇప్పటివరకు..

వైద్య కళాశాలలో 81, నర్సింగ్ స్కూల్ 25, ఫారెస్ట్ విభాగం 15 మొత్తంగా ఇప్పటివరకు 120 పైచిలుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకం చేపట్టిన ఈ ఏజెన్సీ నిరుద్యోగుల వద్ద నుండి రూ. 3 కోట్ల రూపాయల మేర దండుకున్నట్టు వినికిడి. దీంతోపాటు ప్రధానంగా వైద్య విభాగంలోని 155 పోస్టుల భర్తీ నియామకాలు చేపటకముందే డబ్బు వసూళ్లకు పాల్పడింది. వీటి తాలూకా సుమారు నాలుగు కోట్ల రూపాయలు వసూలు చేసినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఈ ఏజెన్సీ గత రెండేళ్ల కాలంలోనే ఏడు కోట్ల పైచిలుకు డబ్బులను జిల్లా నిరుద్యోగుల నుండి వసూళ్లకు పాల్పడింది. అయితే జిల్లా కేంద్రంలో ఇంత చోద్యం జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకునిరెత్తనట్టు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అమాయక నిరుద్యోగుల సొమ్మును బకాసురుల్లా కొందరు ఏజెన్సీ నిర్వాహకులు మెక్కుతున్న జిల్లా యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోకూడదు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులను ఉద్యోగ ఆశ చూపించి యారో ఏజెన్సీ ఇప్పటివరకు చేసిన ఈ దందాపై జిల్లా కలెక్టర్ దృష్టి సారిస్తే మరిన్ని నిజాలు బయటపడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఈ ఏజెన్సీ ద్వారా మోసపోయిన కొందరు బాధితులు "ప్రజాజ్యోతి" తో తమ ఆవేదనను పంచుకొని కొన్ని ఆధారాలను సైతం సమర్పించారు. అయితే ఈ బాధితులలో ప్రధానంగా ఉద్యోగులు, డాక్టర్లు, మీడియా మిత్రులు ఉండడం గమనార్హం.

### స్థలం అమ్మి కట్టాను :

**ఓ నిరుద్యోగి**

ఉన్నత చదువులు పూర్తి చేశాను. ఎటువంటి ఉద్యోగం లేకపోవడంతో.. మాకు తెలిసిన అతను మెడికల్ కాలేజీలో ఉద్యోగం ఇప్పిస్తా.. జీతం 20 వేల దాకా వస్తుందని చెప్పారు. దాన్ని నమ్మి మాకు ఉన్న కొంత స్థలాన్ని అమ్మేశాం. నన్ను వెంటబెట్టుకొని వెళ్లి సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులకు డబ్బులు చెల్లించాడు. కానీ ఇప్పటివరకు ఉద్యోగం రాలేదు. ఏమైనా అడిగితే కోర్టులో మనకి అనుకూలంగా తీర్పు వస్తుంది కొంచెం ఆగండి అంటున్నారు.

### యారోను బ్లాక్ లిస్టులో పెట్టాలి :

**కోటా శివశంకర్ (యువజన సంఘ నాయకుడు)**



ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో యారో ఏజెన్సీ అవకతవకలకు పాల్పడింది. ఒక్కో ఉద్యోగానికి 3 నుండి 5 లక్షల రూపాయలు వసూలు చేసింది. కొంతమంది అధికారుల సైతం ఇందులో సూత్రధారులే.. పాత్రధారులే. ఈ నియామకాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి.. యారో ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకునేంతవరకు మా యువజన సంఘం తరఫున నిరసనలు తెలుపుతాం.

## ఆటోతో ఢీ కొట్టి హత్య ప్రయత్నం చేసిన డ్రైవర్

**చర్ల, అక్టోబర్25, ప్రజాజ్యోతి:**



చర్ల మండల కేంద్రంలో పాత చర్ల, అంబేద్కర్ నగర్ కుడలి అయిన ప్రధాన రహదారి పై కక్షకట్టి ఆటో డ్రైవర్ బైక్ పై వస్తున్న వ్యక్తిని అతని స్నేహితుడిని తన వాహనం అయినా ఆటోతో ఢీ కొట్టి హత్య ప్రయత్నం చేయబోయాడు. వివరాలకు వెళ్తే పాత చర్ల మూలమలుపు వద్ద మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్న వ్యక్తి వద్దకు శుక్రవారం సుమారు మధ్యాహ్నం సమయంలో ఆటో డ్రైవర్ పంచర్ అయినా టైర్ ను తీసుకొచ్చి, పంచర్ వెయ్యమని అడగగా తమ వద్ద పంచర్ సౌకర్యం లేదని మెకానిక్ చెప్పగా, కచ్చితంగా పంచర్ వేయాలని ఆటో డ్రైవర్ గొడవ పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి షెడ్డుకి బైక్ పై వస్తున్న మెకానిక్ ను అతడు స్నేహితుని ఆటోతో ఢీ కొట్టి చంపబోయాడు ఆటో డ్రైవర్. కిందపడిన వారు లేచి బైకును సరిచేసుకొని వస్తుండగా కక్ష తీరని ఆటో డ్రైవర్ వెంటాపడుతూ వచ్చి రైస్ మిల్లు ఎదురుగా సిసి కెమెరా అమర్చిన ఉన్న స్తంభం ముందు బైకును రెండోసారి ఢీకొట్టడమే కా కుండా బైక్ పై ఎక్కించి హత్య ప్రయత్నం చేశాడు అని షెడ్ మెకానిక్ తెలిపాడు. ఈ ఘటనలో మెకానిక్ స్నేహితుడి కాలుకు తీవ్ర గాయం అవడంతో అతడిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. యాక్సిడెంట్ చేసిన ఆటో డ్రైవర్ మాత్రం తనని ఎవరు ఏం చేయలేరని బైక్ పై ఉన్న ఆటోలో కూర్చొని, ధీమాగా సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉన్నది. అతన్ని పోలీసులకు అప్పగించారు.

# అగ్రికల్చర్ డీలర్ల శిక్షణలో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్

**టేకులపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

టేకులపల్లి మండలంలోని బోడు గ్రామానికి చెందిన తేరాల రమేష్ బాబు కలెక్టర్ చేతుల మీదుగా డిప్లమా ఇన్ అగ్రికల్చర్ (దేశి)లో అత్యుత్తమ ప్రతిభలో గోల్డ్ మెడల్ అందుకు న్నారు. వ్యవసాయంలో లాభసాటి విధానంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశాలను రైతులకు తెలియ జేస్తూ ఏ రకమైన సాగు చేస్తే రైతుకు ఉపయోగపడు తుంది. పంటల సాగు విధానం, తదితరా అంశాలపై



దాదాపు 12 నెలలు పాటు డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ (దేశి) ట్రైనింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గోల్డ్ మెడల్ తో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సత్కరించారు. దేశీ లో అత్యు త్తమ ప్రతిభ కనబరిచి మండలానికి గోల్డ్ మెడల్ తీసుకొచ్చిన తేరాల రమేష్ బాబును, మన మండలంలో కొప్పురాయికి చెందిన మరో డీలర్ బొప్పన సుబ్బారావు సిల్వర్ మెడల్ అందుకున్నారు. మండలం ప్రజలు, గ్రామస్తులు, మండల వివిధ శాఖల అధికారులు వారిద్దరినీ అభినందించారు.

# చెత్త వేయవద్దని గ్రామస్తుల ఆందోళన

**– అనారోగ్యానికి గురవుతున్నామని ఆగ్రహం**





**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

ఇల్లందు జెకె 5 ఓసికి వెళ్లే దారి వెంబడి ఉన్న ప్రదేశంలో ఇల్లందు మున్సిపాలిటీ ఇంటింటికి తిరుగుతూ సేకరించిన చెత్తను పడవేయడం జరుగుతుంది. దీంతో ఆ చెత్తలో ప్లాస్టిక్, ఇనుప సామాన్లు సేకరించే వారు ఆ చెత్తను కాల్చడం వల్ల మండ లంలోని సుభాష్ నగర్ పంచాయతీ లలితాపురం గ్రామ ప్రజలు అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చెత్త వాహనాలు రావడంతో వాటిని అడ్డుకున్నారు. మరోమారు ఈ ప్రదేశంలో చెత్త వేయవద్దని కోరారు. చెత్తను కాల్చడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికా రులు, పాలకవర్గ సభ్యులు వచ్చి మరల మున్సిపల్ చెత్తను ఇక్కడ పడవేయమని తమకు నిఖితపూర్వకంగా వ్రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021 నుంచి ఎన్ని సార్లు చెప్పిన తమ ఇబ్బందులు మాత్రం పెరుగుతునే ఉన్నాయని తెలిపారు. దీంతో మున్సిపల్ సిబ్బంది రేపటి నుంచి చెత్తను ఇక్కడ పడవేయమని తెలుపడంతో వివాదం సద్దుమణిగింది.

# ప్రధానోపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం

**ఆళ్ళపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి**

జి పి ఎస్ జిన్నెలగూడెం పాఠశాల నందు సుమారు 13సంవత్సరాలు పని చేసి ఎంతోమంది విద్యార్థుల ను తీర్చి దిద్ది ఇటీవల బదిలీ పై వెళ్లినా ఉపాధ్యాయులు జోగా రాంబాబు, పాయం ప్రసాద రావు ఘనంగా పట్టు శాలువా తో సన్మానం చేశారు, ఈకార్యక్రమం లో మండలవిద్యాశాఖ అధికారి కొమరం శాంతారావు, మర్కో డు పీజీహెచ్ ఎం. బాబు లాల్, అగ్గి. రామకృష్ణ, ముత్తయ్య, నాగేశ్వరావు, సోమ్లా, నరేష్, ముడిగ. సమ్మయ్య, మాజీ యం పి పి పడిగ. సమ్మయ్య హరినాథ్, రవి, భద్రు, బాలకృష్ణ, భోజ్యా, రాము, సురేష్, రామకృష్ణ, గ్రామస్తులు దొర పటేల్, పిల్లలతల్లి దండ్రులు, మరియు సుతారి కృష్ణ, కొమరం వెంకటేశ్వర్లు, గ్రామ యూత్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.



# కబడ్డీ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**పాల్వంచ, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల వాల్ పోస్టర్ ను పాల్వంచలో డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్ రావు, భద్రాద్రి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్ ప్రెసిడెంట్ నూకల రంగారావు, మండల ప్రెసిడెంట్ కొండ వెంకన్న, జానకి రెడ్డి, ముత్తయ్య, మహిపతి రామలింగం, సందుపట్ల శ్రీనివాస్, అయితా గంగాధర్, బద్రి కిషోర్, చింతా నాగరాజు, మిర్యాల కమలాకర్, విజయ్, నాగేశ్వరావు, శ్రీలత రెడ్డి, స్వాతి రెడ్డి, అరుణ రెడ్డి, శశి, సదా, ఉపేందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## శరవేగంగా జరుగుతున్న ఇల్లందు మోడల్ మార్కెట్ పనులు

**–పనులను పర్యవేక్షించిన ఇల్లందు మున్సిపల్ చైర్మన్**

**–రెండు వారాల్లో ప్రారంభోత్సవానికి సన్నాహాలు**



**ఇల్లందు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

ఇల్లందు మున్సిపాలిటీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్న మోడల్ మార్కెట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో 2 వారాలలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కన కయ్యల చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నహాలు చేస్తున్నట్లు ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మోడల్ మార్కెట్ పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రారంభమైన వెంటనే అర్హులందరికీ షాపులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శెట్టి వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

## బస్సు షెల్టర్ స్థల పరిశీలన



**జూలూరుపాడు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి**

ప్రజల ప్రధానమైన సమస్య.. ఇక పరిష్కారం కానుంది జూలూరుపాడు మండల కేంద్రంలో....ప్రజల సౌకర్యార్థం...బస్ షెల్టర్ & పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం...స్థల పరిశీలన చేసిన... కొత్తగూడెం సింగరేణి సంస్థకు చెం దిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్, సీఓ రాధాకృష్ణ, సిబ్బంది, పక్కన నాయకులు

## రామయ్య సేవలో ఎమ్మెల్సీ కోదండరాం



**భద్రాచలం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని తెలంగాణ జనసమితి వ్యవస్థాప కులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం ను ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉప ఆలయా లైన లక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామిలను దర్శించుకోగా అర్చకులు పూజలు నిర్వహించి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. తొలుత జూనియర్ కళాశాల క్రీడామైదా నంలో వాకింగ్ చేసిన కోదండరాం అక్కడి వాకర్స్ తో ముచ్చటించి వారి సమ స్యలను అడిగితెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో జనసమితి బాధ్యులు నాయకులు పూనెం ప్రదీప్, రామారావు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే తెల్లం



**భద్రాచలం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

భద్రాచలం పట్టణం భగవాన్ దాస్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుకు రూ.45వేలు, రాముకు రూ.45వేల చెక్కులు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు కావడంతో ఆ చెక్కులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ప్రమాదాలకు గురైన వారు సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటే నగదు మంజూరు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో మండల నాయకులు నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, కృష్ణార్జునరావు, మట్టా శివాజీలు పాల్గొన్నారు.

# ఈనెల 27న హనుమాన్ చాలీసా పారాయణం

## హాజరుకానున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**



ఈనెల 27న కొత్తగూడెం, విద్యానగర్ ఈకే విద్యాలయ ప్రాంగణంలో విశ్వశాంతి కొరకు హనుమాన్ చాలీసా విరాట్ పారాయణం నిర్వహించనున్నట్లు హనుమత్ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరుకానున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. విశ్వశాంతి కొరకు హనుమాన్ చాలీసా ,విరాట్ పారాయణం ,శ్రీ ఆదిత్య హృదయ, శ్రీ విష్ణు శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం ప్రాంగణంలో సామూహికంగా జరపనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హనుమత్ ఉపాసకులు, శ్రీ వాసుదేవానంద భారతి స్వామి రానున్నట్లు తెలుపుతూ అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని సభ్యులు జె చిరంజీవ ,జి రవిచంద్ర ,చలం, పి.వి.రామచంద్రరావులు తెలియజేశారు.

# తెలంగాణా ఉద్యమనేత కోదండరాంను సన్మానించిన కొత్వాల



**పాల్వంచ, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

తెలంగాణా ఉద్యమ నేత, శాసన మండలి (ఎమ్మెల్సీ) సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం ను డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. పాల్వంచ పర్యటన కు వచ్చిన కోదండరాం మండల పరిధిలోని జగన్నాధపురం పెద్దమ్మతల్లి దేవాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల ఆయనను దేవాలయం వద్ద ఘన స్వాగతం పలికి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, బానోత్ బాలాజీ, బాదర్ల జోషి, కామాచారి తదితరులు పాల్గొన్నారు.

# వెదురు ఉత్పత్తులను పరిశీలించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ





**చంద్రుగొండ, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి:**

కలెక్టరేట్లో ప్రదర్శించిన వెదురు ఉత్పత్తులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆసక్తిగా పరిశీలించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో చంద్రుగొండ మండలం బెండలపాడు వెదురు ఉత్పత్తుల క్లస్టర్ ఈసం నాగభూషణం, డైరెక్టర్ దిశా కమిటీ సభ్యులు బోర్ర సురేష్‌తో పాటు సభ్యులు కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవ తో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కలిశారు. వెదురు ఉత్పత్తుల తయారీని వివరించి వాటిలో ఉన్న సాధక బాధలను గవర్నర్కు తెలియజేశారు. వెదురు ఉత్పత్తుల తయారీకి కావాల్సిన సదుపాయాలను, సమస్యలు తెలిపారు. స్పందించిన గవర్నర్ ప్రతిపాదనలతో కూడిన నివేదికను పంపాల్సిందిగా కలెక్టర్ ను ఆదేశించారు. తొలుత గవర్నర్ను క్లస్టర్ డైరెక్టర్లు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ ఎంపీడీవో అశోక్ ,డైరెక్టర్లు మల్లం కృష్ణయ్య ,కారం అన్వేష్ ,పర్సా శ్రీను, పద్దం భద్రయ్య పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ టవర్ ఇంచార్జ్ మండలంలో పర్యటన





**టేకులపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీకాం మొబైల్ టవర్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎస్. తారాచంద్ సి.సి.ఎ శుక్రవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు టేకులపల్లి స్థానిక గ్రామ పంచాయతీలో గల బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సర్వీసెస్ గురించి , బిఎస్ఎన్ఎల్ మొబైల్ సిగ్నల్స్ పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టేకులపల్లి మండలంలో బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత మెరుగు పరచడం కోసం కృషి చేస్తాము అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మొక్కను నాటారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్ రావు, పంచాయతీ కార్యదర్శి దీప్తి, మాజీ సర్పంచ్ సరిత, బిఎస్ఎన్ఎల్ ఆఫీసర్లు బానోత్ సక్రు నాయక్, సుధీర్, బాలాజీ, అశోక్, ఉదయ్, శివరాంజీ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 28 నుండి పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు






**కొత్తగూడెం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

ఈనెల 28 నుండి రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన అని పురస్కరించుకొని పీఎస్ఆర్ ట్రస్ట్ భద్రాద్రి జిల్లా కబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలుపుతూ జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎండి గౌస్ మండల మైనార్టీ అధ్యక్షులు అయూబ్ ఖాన్ కొత్తగూడెం నియోజకవర్గంలోని మసీద్ కమిటీ మత పెద్దలను ఆహ్వానించారు. ఈనెల 28 29 30వ తేదీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీడీపీఎస్ సలీం ,అసెంబ్లీ ప్రెసిడెంట్ గౌస్, టౌన్ ప్రెసిడెంట్ జానీ టౌన్ జనరల్ సెక్రటరీ కమార్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ భవనంలో తలసేమియా వార్డును ప్రారంభించిన గవర్నర్



**భద్రాచలం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**
భద్రాచలం పట్టణంలో రెడ్ క్రాస్ భవనంలో తలసేమియా వార్డును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న 400 మంది వ్యాధిగ్రస్తులకు భద్రాచలంలో ప్రత్యేక తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వార్డును రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు రూ.46లక్షలతో 20బెడ్లతో ఏర్పాటు చేయగా... ఈ వార్డును గవర్నర్ ప్రారంభించారు. ఇప్పటికే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు ను అందుబాటులోకి తీసుకురాగా.. తాజాగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా రోగుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక వార్డును ప్రారంభించుకోవడంతో వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరం అని అన్నారు . ఈ వార్డు ఏర్పాటుతో వ్యాధిగ్రస్తులు రక్తం ఎక్కించుకోవాలన్నా, చికిత్స పొందాలన్నా ఖమ్మం, విజయవాడ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే చికిత్స తీసుకోవచ్చు . సాక్షాత్తు రాష్ట్ర గవర్నర్ ఈ వార్డును ప్రారంభించడంతో వ్యాధిగ్రస్తులకు మరింత ఉపయోగకరం కానుంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ పాటిల్, పీవో రాహుల్, ఎంపీ పోరిక బలరాం నాయక్ , ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు ఎస్.ఎల్.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# రీయూజ్ స్టాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఏకోబ్రిక్ టీపాయ్





**బూర్గంపహాడ్, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి**
రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ బూర్గంపహాడ్ మండలం సారపాక పంచాయతీ నుంచి ఏర్పాటు చేసిన రీయూజ్ స్టాల్లో ఏకోబ్రిక్ టీపాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సారపాక గ్రామంలో ప్రజలు వాడిపారేసిన ప్లాస్టిక్ బాటిళ్లతో తయారుచేసిన ఏకోబ్రిక్ టీపాయ్ను సాక్షాత్తు గవర్నర్ చూసి మురిసిపోయారు వాడి, వదిలేసిన వాటర్, కూల్డ్రింక్ బాటిళ్లతో టీపాయ్ను తయారుచేసిన విధానాన్ని కలెక్టర్ గవర్నర్కు వివరించగా అద్భుతంగా చేశారంటూ కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విద్యాచందన, వేణుగోపాల్, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎస్బీఎం జిల్లా కోఆర్డినేటర్ రేవతి, ఖాదర్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్ శర్మ, సారపాక పంచాయతీ ఈవో కంది మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ





**భద్రాచలం, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**
భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్నదాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. రామయ్యకు పట్టాభిషేకం...భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో రామయ్యకు పట్టాభిషేకాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలలో పుష్యమి నక్షత్రం సందర్భంగా శ్రీరామపట్టాభిషేకం నిర్వహించడం అనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం అర్చకులు భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

## రైతులందరికీ మునగ సాగుపై అవగాహన సదస్సు

**జూలూరుపాడు , అక్టోబర్ 25, ప్రజా జ్యోతి**
జిల్లా కలెక్టర్ గారి ఆదేశములు అనుసరించి నేటి ఉదయం 11 గంటలకు కాకర్ల గ్రామంలో రైతు వేదిక నందు 1.కాకర్ల 2.మాచినపేటతండా ,3.మాచినపేట ,4.పడమటి నరసాపురం ,5.అనంతారం , 6.గురవాగుతండ, గ్రామపంచాయతీ ల రైతులందరికీ మునగ సాగు పై అవగాహన సదస్సు కలదు కావున పై గ్రామపంచాయతీలో అందరికీ టి.ఏలు ఎఫ్.ఏలు రైతులందరికీ తెలియపరచి తోడుకొని రాగలరు. జూలూరుపాడు ఎంపీడీవో ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

## ప్రైవేటు వాహనాలకు నిలయంగా బస్టాండ్



**చంద్రుగొండ, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**
చంద్రుగొండ బస్సు ప్రయాణ ప్రాంగణము కాదు ఇది వాహనాలు నిలుపు కొను స్థలము అని చెప్పవచ్చు. పై ఫోటో చూస్తే మీకే అర్థమవుతుంది ఇది పేరుకే బస్ స్టాండ్ కానీ ఇక్కడ బస్సులు ఆగవు, మరమ్మత్తులకు నోచుకోదు. ప్రయాణికులు అత్యవసర పరిస్థితిలో వాడుకోవటానికి మరుగుదొడ్లు ఉండవు. అపరిశుభ్ర వాతావరణం ఇదే చంద్రుగొండ బస్టాండ్. ఇటీవల కొత్తగూడెం డిపో మేనేజర్ సందర్శించి మరమ్మత్తులు చేస్తాం, బస్సులు ఆగేవిధంగా చూస్తాం... ఇలా చేస్తాం, చూస్తాం అనేవారే తప్ప పట్టించుకునే నాదుడే లేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. బస్టాండ్ ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులకు అనుగుణంగా అపరిశుభ్ర వాతావరణం లేకుండా మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలని బస్సులు ఆగేవిధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక



**టేకులపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి :**
26వతేదీన మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉపాధి పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఎంపీడీవో రవీందర్రావు ఒక ప్రకటనలో తెలిపారు . శుక్రవారం టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్రావు మాటాడుతూ 2023–24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులను ఈ నెల18నుంచి 25వరకు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రామానికి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## పాఠశాల విద్యార్థులకు టైలు, బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ

### వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వితరణ




**టేకులపల్లి, అక్టోబర్25, ప్రజాజ్యోతి :**
మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు కొత్తగూడెం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టులు, టైలు, బ్యాడ్జీలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ పొగాకు లక్ష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వాసవిక్లబ్ కొత్తగూడెం అధ్యక్షుడు గుబ్బా శ్యామ్ గోపాల్, ప్రధాన కార్యదర్శి వల్లాల మణిదీప్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ చెక్క ఫణీంద్ర కుమార్, సీనియర్ వాసవి సభ్యుడు చౌడవరపు దత్తుప్రసాద్ ల చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమంనిర్వహించారు. వాసవి క్లబ్ సీనియర్ బాధ్యులు ముక్కా కనకేశ్వరరావు, చారుగుండ్ల శ్రీమన్నారాయణలు పేద ప్రభుత్వ పాఠశాలలో ఈ పంపిణీ చేసి తమ దాతృత్వం చాటుకున్నారు. స్కూల్ హెచ్ఎం జ్యోతిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, పాఠశాల టీచర్లు పద్మ ,నీరజ షారోన్, ఎండిఎం వర్కర్స్ సరోజ, పార్వతి ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యురాలికి చిరు సత్కారం

–డిడివో గా భాధ్యతలు గాను హాస్పిటల్ సిబ్బంది చిరు సత్కారం



**ఆళ్ళపల్లి, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి**

ఈ రోజు ఆళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోడాక్టర్ కేవీ సంఘామిత్ర కి ఆసుపత్రి సిబ్బంది చిరు సత్కారం జరిగింది. డిడివో గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కి సన్మానం చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. డిఇఓ నాగేశ్వరా మెడికల్ ఆఫీసర్ కేవీ.సంఘామిత్ర టి.రమా దేవి హెల్త్ ఎడ్యుకేటర్ వి.విసులోచన హెల్త్ సూపెర్వైసోర్బి.మురళీ.మోహన్. ఫార్మాసిస్ట్ సునీత స్టాఫ్ నర్స్ హెల్త్ అసిస్టెంట్స్ ఎం .నరేష్, శ్రీధర్ బాబు. ఏఎన్ఎంలు.వి. సుగుణ, సావిత్రి, రమణ. ఎంఎల్ఎహ్ పి .రేవతిమరియు యాఖుబీ, మాలు తదితరులు పాల్గొన్నారు

## తేగడ ఉపాధ్యాయురాలికి గవర్నర్ మీటింగ్ కు ఆహ్వానం



**చర్ల, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

చర్ల మండలం, తేగడ ఉపాధ్యాయురాలికి గవర్నర్ అఫీషియల్ విజిట్ లో భాగంగా,జిల్లాలో విభిన్నరంగాల్లో ప్రఖ్యాతి గడించిన 25మంది మహోన్నతులైన కవులు, కళాకారులు, రచయితలు, ప్రకృతి ప్రేమికులు, క్రీడాకారులతో గవర్నర్ మీటింగ్ కు చర్లమండలంతేగడ ZPHS పాఠశాలలో ఇటీవల DSC లో హిందీ ఉపాధ్యాయినిగా నియమితురాలైన శ్రీమతి తురుమెళ్ళ కళ్యాణి కి ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో పాల్గొని తనకవితతో కూడిన జాతీయ స్థాయి హిందీ సంకలనాన్ని గవర్నర్ కు అందించి ప్రత్యేక ప్రశంసలు పొందారు. కళ్యాణి కవయిత్రి, రచయిత్రి, రేడియో వ్యాఖ్యాత , బహుముఖ ప్రజ్ఞాశాలి గా పేరు ప్రఖ్యాతలు గడించిన ఫలితంగా ఈ అరుదైన ఆహ్వానం లభించిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కళ్యాణికి పాఠశాల HM, MEO రమణ , తోటి ఉపాధ్యాయులు శ్రీమతులు జ్యోతి, జయమ్మ , తేజ, మంజులవాణిలు . స్నేహితులుసురేష్ బాబు, యాదగిరి, శ్రీను, శ్రీధర్ లు ప్రత్యేక ప్రశంసలు తెలిపారు

# వెంకటాపురం, వాజేడుతో పాటు విలీన పంచాయతీలను భద్రాచలంలో కలపాలి

–రాష్ట్ర గవర్నర్కు బీజేపీ నేతల వినతి



**బూర్గంపహాడ్, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి**

విభజన సమయంలో వెంకటాపురం, వాజేడు మండలాలు ములుగు జిల్లాలో కలిపారని వాటిని భద్రాచలం నియోజకవర్గంలో కలపాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్రెడ్డి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఐటీసీ గెస్ట్ హౌస్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విభజన సమయంలో ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలు(20 గ్రామాలు) పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెంలను తిరిగి తెలంగాణాలోని భద్రాచలం నియోజకవర్గంలో కలిపి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్లు కుంజా ధర్మా, గుగులోతు బాలునాయక్, మండల అధ్యక్షుడు బీరక సాయిశ్రీను, భద్రాచలం మండల ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, మండల మాజీ అధ్యక్షుడు చుక్కపల్లి బాలాజీలు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు : కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాచలం, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి)**



తెలంగాణరాష్ట్రగవర్నర్జిష్ణుదేవ్వర్మరెండురోజుల పర్యటన విజయవంతం అవ్వడానికి కృషిచేసిన జిల్లా అధికారులకు, ఐటీడీఏ అధికారులకు అభినందిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.శుక్రవారం నాడు ఐ డి ఓ సి కార్యాలయంలో గవర్నర్ సమావేశం అనంతరం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన పలువురు ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, అడ్వకెట్లు , అవార్డుగ్రహీతలను కలిశారు . అనంతరం జిల్లా కలెక్టర్ , ఐటీడీఏ పీవో బి రాహుల్ మాట్లాడుతూ 24 , 25 తేదీలలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రెండు రోజుల పర్యటనలో భాగంగా సంబంధిత అధికారులు వారి వారి శాఖల ప్రగతి నివేదికలతో పాటు పర్యటన విజయవంతం అవ్వడానికి ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు . పర్యటన విజయవంతం అవ్వడంలో పాలుపంచుకున్న వివిధ శాఖల అధికారులు, ఐటీడీఏ సిబ్బంది, స్వయం సహాయక మహిళా బృందాలకు గిరిజన మహిళలకు, పోలీస్ శాఖ వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. అన్నారు.

# జంట పట్టణాల అభివృద్ధికై "కుడ"

- కొత్తగూడెం, పాల్వంచ, పరిసర గ్రామాలతో 'కుడ' ఏర్పాటుకు
- జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కూనంనేని విజ్ఞప్తితో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- జంట పట్టణాల అభివృద్ధికి 'కుడ' దోహదపడుతుంది : కూనంనేని



**కొత్తగూడెం, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి :**

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుతూ హెచ్ఎండిఏ తరహాలో కొత్తగూడెం అర్బన్ డవలప్మెంట్ అథారిటీ (కుడ) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో నెంబర్ 177 జారీ అయ్యింది. 'కుడ' ఏర్పాటుతో కొత్తగూడెం,పాల్వంచ పట్టణాలు సమగ్రంగా అభివృద్ధి సాధిస్తాయని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలుమార్లు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన ఫలితంగా ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు పారిశ్రామిక ప్రాంతాలుగా రోజురోజుకు విస్తరిస్తున్నాయని, షెడ్యూల్ భూములు, సింగరేణి, ఇతర పరిశ్రమల భూములు ఎక్కువగా ఉండటంతో 'కుడ' ఏర్పాటు వలన ఈ ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి సాదించేందుకు దోహదపడుతుందన్నారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను అభివృద్ధిలో మహానగరాలకు ధీటుగా అభివృద్ధి సాధించాలంటే 'కుడ' ఏర్పాటు తప్పనిసరిగా గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 'కుడ'ఏర్పాటుకు ఆమోదం తెలిపి జీవో జారీచేసింది కూనంనేని తెలిపారు. అనతికాలంలో జంట పట్టణాలతోపాటు నియోజకవర్గం ఊహించని రీతిలో అభివృద్ధి సాదిస్తుందని, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. తన విజ్ఞప్తిపై స్పందించి 'కుడ' ఏర్పాటుకు జీవో జారీచేసిన ప్రభుత్వానికి కూనంనేని అభినందనలు తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**బూర్గంపాడు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి :**

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తెలంగాణరాష్టంలో 50 లక్షల సభ్యత నమోదు పూర్తి చేయాలని సంకల్పంతో ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ఫోన్ ద్వారా ప్రాథమిక సభ్యత్వ నమోదు చేసిన జిల్లా మాజీ అధ్యక్షులు మాజీ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగుల వెంకట్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ గుగులోత్ బాలు నాయక్ మండల అధ్యక్షులు బీరక సాయిశ్రీను మండల మాజీ అధ్యక్షులు చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొని భారతీయ జనతా పార్టీ దేశంలో అత్యధిక సభ్యత్వ నమోదు పార్టీగా అవతరించి దేశం కోసం ధర్మం కోసం పని చేసే బిజెపి కి మద్దతు ఇచ్చి ప్రతి ఒక్కరు 8800002024 నెంబర్ కు మిస్డ్ కాల్ చేసి బిజెపి లో భాగస్వాములు కావాలని కోరడం జరిగింది.






# ఇంకెన్నాళ్లు...?

- భద్రాద్రి పాలకమండలిపై కొనసాగుతున్న నిరీక్షణ
- స్వరాష్ట్రంలో ఏర్పడని పాలక మండలి
- భర్తీ కోసం ఆశగా ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొలువుదీరేనా...?

**సీతా లక్ష్మణ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి నడయాడిన ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచల దివ్య క్షేత్రం. స్వరాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైన ఈ ఆలయం ప్రస్తుతం అభివృద్ధి పనులకు కేంద్రంగా మారుతుందా ? అంటే అవుననే సమాధానం లభిస్తుంది. నూతన రాష్ట్ర ప్రభుత్వం సైతం 60 కోట్లకు పైగా నిధులు అభివృద్ధి పనులకు కేటాయించగా, ఆలయ పరిసర ప్రాంతాల్లోని మాడ వీధుల విస్తరణ పనులకు స్థల సేకరణ, తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా కొలువుతీరని పాలకమండలిపై మరోసారి చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రాద్రి పాలక మండలిపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం...**

◆ భద్రాచలం, ప్రజాజ్యోతి

దక్షిణఅయోధ్యగాకీర్తిగడించినతెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా విరాజుల్లుతున్న భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో పాలకమండలి ఏర్పాటుకు ఇంకెన్నాళ్లు సమయం పడుతుందని రామ భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి దశాబ్దకాలంగా స్వరాష్ట్రంలో భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటు కల సాకారంకాలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం రెండు దఫాలు బీఆర్ఎస్ అధికారం చేపట్టినా భద్రాద్రి దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై కనీస కసరత్తు కూడా చేపట్టలేదు. ఫలితంగా దక్షిణఆయోధ్యపాలకమండలి లేకుండానే కొనసాగుతోంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చివరిసారిగా పాలకమండలి 2010లో నియమించారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం ఎందరో ఆశావాహులు భద్రాద్రి పాలక మండలి చైర్మన్ కోసం విశ్వప్రయత్నాలు చేశారు. ఈక్రమంలో పలువురి పేర్లు తెరపైకి వచ్చినా ఆచరణలో మాత్రం పాలకమండలి రూపుదిద్దుకోకపోవడం గమనార్హం. అదిగో ఇదిగో అంటూ అప్పుడప్పుడు పాలక మండలిపై సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం జరుగుతోంది తప్ప వాస్తవంగా కార్యరూపం దాల్చింది లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటు జరుగుతుందో.. లేదో.. వేచి చూడాల్సిందే....

## 14 ఏళ్ల క్రితం...

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పాలకమండలి చివరిసారిగా 14 ఏళ్ల క్రితం కొలువుదీరింది. 2010 నవంబరు 26న నాడు దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా భద్రాచలానికి చెందిన కురిచేటి పాండురంగారావు బాధ్యతలు స్వీకరించారు. 2012 నవంబరు 25న పాలక మండలి గడువు ముగిసింది. అనంతరం 2014 జూన్ 2న ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయింది. నాటి నుంచి నేటి వరకు స్వరాష్ట్రంలో భద్రాద్రి దేవస్థానానికి పాలక మండలి నియామకం ఆచరణకు నోచకోలేదు. గత దశాబ్దకాలంలో అప్పటి అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు, సానుభూపతిరులు, ఆధ్యాత్మికవాదుల పేర్లు పలుమార్లు తెరపైకివచ్చినా కేసీఆర్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదనే విమర్శలు వినిపించాయి.

## ఇప్పటి వరకు 13 పాలక మండళ్లు...

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని 17వ శతాబ్దంలో భక్తరామదాసు నిర్మించారు. 1960లో భద్రాద్రి రామాలయం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని దేవాదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. దాంతో అప్పటి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్ గా భద్రాద్రి రామాలయ అభివృద్ధి కమిటీ రూపుదిద్దుకుంది. అనంతరం భద్రాద్రి దేవస్థానానికి పాలకమండళ్లను నియమించడం సంప్రదాయంగా మారింది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 13 పాలక మండళ్లు కొలువుదీరాయి. తొలినాళ్లలో మూడేళ్లపాటు పాలకమండలి పదవీకాలం ఉండగా అనంతరం ఏడాది కాలం పాటు తరువాత మళ్లీ రెండేళ్లపాటు పదవీకాలాన్ని నిర్ణయించారు. దేవస్థానం పాలక మండలికి తొలి చైర్మన్ గా కల్లూరి చంద్రమౌళి వ్యవహరించారు. కాగా అల్లూరి మూర్తిరాజు పాలకమండలి చైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు.

## ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్లు వీరే...

కల్లూరి చంద్రమౌళి, బండి శోభనాచలం, ఎన్. యతిరాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, అల్లూరి మూర్తిరాజు, కోనేరు నాగేశ్వరరావు, బోళ్ల వెంకటేశ్వర్లు, కత్తుల శాంతయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వర రావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావు ఉన్నారు.

## ఆశావాహులు అనేకం...

చైర్మన్ పదవిపై కన్నేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు రాజధాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దేశవ్యాప్తంగా పేరుండటంతోపాటు వీఐపీలు, వీవీఐపీలు తరచుగా దర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రస్టు బోర్డు చైర్మన్ గా పలువురు తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగి ఒకరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించటంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమ పరిచయాలు తనకు కలిసి వస్తాయని ఆయన భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులతో సామాజికవర్గ సంబంధాలు విశ్రాంత ఉద్యోగికి అనుకూలంగా మారే అవకాశం ఉంది. మాజీ మంత్రి స్వర్గీయ రామిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు రామిరెడ్డి గోపాల్ రెడ్డి ,పినపాక నియోజకవర్గానికి చెందిన తుళ్లూరి బ్రహ్మయ్య ,పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి భద్రాచలంకు చెందిన నల్లపు దుర్గాప్రసాద్ ,బుడగం శ్రీనివాస్,భోగాల శ్రీనివాస్ రెడ్డి తమకున్న పరిచయాలతో ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి . వీరితోపాటు పలువురు కాంగ్రెస్‌నాయకులు. తెలంగాణ ఉద్యమకారులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం అయినా భద్రాద్రి ట్రస్టు బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుందని రామ భక్తులు ఆశావాకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



# ఎస్పీ ఎదుట లొంగిపోయిన ఆరుగురు క్రియాశీల మావోయిస్టులు



**చర్ల, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి:**

ఎన్కౌంటర్లు, లొంగుబాటులతో వరుస ఎదురుదెబ్బలతో సతమతమవుతున్న మావోయిస్టు పార్టీ. చత్తిషుగడ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎన్కౌంటర్లలో మృత్యువాత పడుతూ , లొంగిపోతున్న క్రమంలో,మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలలో తమ ఉనికి కోల్పోతున్న మావోయిస్టు పార్టీ. ఈ నేపథ్యంలోనే చత్తిషుగడ్ రాష్ట్రం,సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ ఎదుట మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న, ఆరుగురు క్రియాశీలిక మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఆరుగురు పై సుమారుగా 20 లక్షల రూపాయల రివార్డు ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. వీళ్లు గతంలో ప్రభుత్వ వ్యతిరేక , విధ్వంసక సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ధ్రువీకరించినట్లు, పోలీసులు పేర్కొన్నారు.

# గవర్నను కలిసిన బీజేపీ నాయకులు



**బూర్గంపాడు, అక్టోబర్ 25, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవవర్మని మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షులు నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ కుంజా ధర్మా,గుగులోత్ బాలు నాయక్, భూర్గంపహాడ్ మండల అధ్యక్షులు బీరక సాయి శ్రీను భద్రాచలం మండల ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, బూర్గంపాడు మండల మాజీ అధ్యక్షులు చుక్కపల్లి బాలాజీ కలవడం జరిగింది.

# నేడే ఎమ్మెల్యే తెల్లం పర్యటన



**చర్ల, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి:**

చర్ల మండలం కేంద్రంలో రైతు వేదిక నందు భద్రాచలం అసెంబ్లీ నియోజక వర్గ శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు సమావేశం కలదు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావలసిందిగా, మండల పరిధిలో ఉన్న పత్రికా విలేకరులు, మీడియా విలేకరులందరూ హాజరవల్సిందిగా ప్రకటన ద్వారా చర్ల మండలం పరిషత్ అభివృద్ధి అధికారి పేర్కొన్నారు.